విసుక్కుంటూ మళ్లీ ఫోన్ అందుకున్నాడు.

"ఏమిటి? " విసుగునంతా గొంతులో ప్రతిఫలింపచేస్తూ అడిగాడు.

"ఎమర్జెన్సీ అట సర్! మిమ్మల్ని అర్జెంటుగా కలవాలట" చెప్పింది సెక్రటరీ.

అతనికి కోపం తెప్పిస్తున్నానన్న భయం ఆమె గొంతులో వణుకులా ప్రతిఫలించింది. ఆ వణుకు గమనించిన అతనికి సగం కోపం తగ్గటమే కాక, తృప్తి కూడా కలిగింది. అందుకే పెద్దగా రెట్టించకుండా "సరే! పంపు" అన్నాడు.

మల్హోత్రా సోఫా నుండి లేచి విశాలమయిన టేబుల్ వెనక ఉన్న ఛైర్లో కూర్చున్నాడు.

పరుగెత్తుతున్నట్లు లోపలకు వచ్చాడు దిలీప్. అతని మొహంలో ఆందోళన చూస్తుంటే విషయం గంభీరమైనదే అనిపిస్తోంది.

మల్హోత్రా కూర్చోమనటంతో ఎదురు కుర్చీలో కూర్చున్నాడు.

"చెప్పు, ఏమిటింత హడావుడి? "

"మన బ్యాంకు ఎకౌంట్లు ఫ్రీజ్ చేశారు సర్"

"అదేమిటి? ఎవరు చేశారు? ఎందుకు చేశారు? "

"మన కంపెనీ మీద పెట్టిన 'ఫెమా' కేసులో ప్రభుత్వానికి రుజువులు దొరికాయంట. అందుకే కోర్టు ద్వారా ఈ చర్య తీసుకున్నారు"

"మన కంపెనీలో లొసుగులు ఉన్నాయా? " ఆశ్చర్యంగా అడిగాడు మల్హోత్రా.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. అతను వ్యాపారంలో తప్పుడు మార్గాలను ప్రోత్సహించడు.

"మనకు తెలిసి మనమేమీ తప్పులు చెయ్యలేదు"

"మరి మన లాయర్లేం చేస్తున్నారు? "

"వాళ్ల ప్రయత్నం వాళ్లు చేస్తున్నారు"

"వాళ్లున్నది ప్రయత్నం చెయ్యటానికి కాదు. లక్షల్లో ఫీజు తీసుకుంటున్నప్పుడు రిజల్ట్స్ చూపించాలి"

దిలీప్ ఏ కామెంటూ చేయకుండా మౌనంగా ఉండిపోయాడు.

"మన కంపెనీలో పెట్టుబడి పెట్టిన వాడు తప్పుడు మార్గాల్లో పెట్టుబడి పెట్టాడని రుజువయితే.. వాళ్లని పట్టుకోమనండి. నామీద పడితే నేనేమి చేస్తాను? "

"వాళ్లు విదేశీయులు. వారి ప్రభుత్వానికి వారి పేర్లు సూచించటం తప్ప మన ప్రభుత్వశాఖలు వారినేమీ చెయ్యలేవు"

"అందుకని ఎవడో ఒకడిని బలి పశువును చేస్తారా? " విసుగ్గా అన్నాడు మల్హోత్రా.

"చట్టం అలా ఉంది సర్!"

"ఉంటే ఉండనివ్వండి. అయినా ఇవన్నీ ముందే ఊహించినవేగా? మనకి ప్రతి రోజూ ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం ఉంటుంది కదా! ప్రస్తుతానికి మన అవసరాలన్నీ ఆ ఆదాయం నుండే జరపండి"

"ఆ ఎకౌంట్లో నుండి పైసా కూడా రిలీజ్ చేయటానికి బ్యాంకర్లు ఒప్పుకోవటం లేదు"

"అదేమిటి? "

"వాళ్లకి రావలసిన అప్పు వాయిదాలు మనం కట్టలేదు కదా! ఆ బాకీ డబ్బులు ఈ ఎకౌంట్లో నుండి తీసుకుంటారంట"

"వచ్చిన ఆదాయం అంతా వాళ్లు తీసేసుకుంటే మన విమానాలు నడిచేదెట్లా? "

"నేనూ అదే అన్నాను సర్! కానీ నా మాట వాళ్లు పట్టించుకోవడం లేదు"

"బంగారు గుడ్లు పెట్టే బాతును కోసిన అత్యాశాపరుడి కథ చిన్నప్పుడు చదువుకున్నాం. అలాగే చిన్న చిన్న వాయిదాల కోసం మన సంస్థను మూలబడేటట్లు చేస్తే



మనతో పాటు వారూ మునుగుతారు. అప్పుడు మొత్తం బాకీ రద్దు చేసుకోవలసి ఉంటుంది. ఆ మాత్రం ఇంగితం కూడా ఆ బ్యాంకర్లకు ఉన్నట్లు లేదు. లేదూ.. వారికి ఈ విషయం వివరించి చెప్పటంలో మనం విఫలమయ్యాం అనుకోవాలి. ఏది కరెక్టో మీరే చెప్పండి" కోపంగా అన్నాడు మల్హోత్రా.

దిలీప్ మరలా మౌనంగా ఉండిపోయాడు.

"మిమ్మల్ని అపాయింట్ చేసుకున్నది సమస్యలకు సమాధానం చూపిస్తారని. అంతే తప్ప సమస్య రాగానే నా దగ్గరకు పరిగెత్తుకు రావటానికి కాదు"

"అది చెప్పటానికే వచ్చాను సర్! అన్ని బ్యాంకులవాళ్లూ కలిసి మీటింగ్ పెట్టారు. మనకిచ్చిన అప్పులకు కట్టవలసిన వాయిదాలు పేరుకు పోవటంతో వారు భయపడి పోయారు. ఆ సమావేశానికి మనల్ని



కూడా పిలిచారు. ఆ సమావేశాన్ని మీరైతేనే హ్యాండిల్ చేయగలరు. మీరు దానికి వెళ్లకపోతే వారికి ఇష్టమొచ్చిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అందుకే మీరు వెళ్లి ఎలా అయినా వారిని కన్విన్స్ చేసి మన ఆదాయాన్ని లోన్‌లకు జమ వేసుకోవద్దని ఒప్పించగలగాలి"

"ఎప్పుడు ఆ మీటింగ్? "

"ఇంకొక గంటలో"

"సరే! నేను వెళ్తాను"

"మీకు కావలసిన వివరాలన్నీ ఈ ఫోల్డర్‌లో ఉన్నాయి. బ్రీఫ్ చెయ్యమంటారా? "

"అక్కర్లేదు" అని, "అయిపోయిందా? చెప్పవలసింది ఇంకేమన్నా ఉందా? " అన్నాడు నిశ్చలంగా.

"ఎయిర్‌పోర్ట్ అథారిటీ వాళ్లకు కట్టవలసిన బిల్లులు పేరుకు పోయాయి. అర్జంటుగా తీర్చకపోతే మన విమానాలు ఎయిర్‌పోర్ట్‌లో దిగటానికి పర్మిషన్ ఇవ్వమంటున్నారు"

"ఇంకా? "

"ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వలేదు. వాళ్లు సమ్మె నోటీసు ఇచ్చారు"

"అవును! అలా జరగకుండా ఉండవలసింది. వాళ్ల జీతాలకు కావలసిన డబ్బు ఏర్పాటు చేశాను. నా వ్యక్తిగత ఖాతాలో ఉన్న డబ్బు వారి జీతాలకు సరిపోతుంది. అందులో నుండి డబ్బు తీసి వారికి జీతాలు చెల్లించండి" బ్రీఫ్ కేస్ నుండి తన చెక్‌బుక్ తీస్తూ అన్నాడు మల్హోత్రా.

"ఎయిర్‌లైన్స్ లాంటి సంస్థల్లో వినియోగదారులకు అందించే సేవలే ప్రధానం. అలాంటి సేవలు అందించటానికి ఉద్యోగులే ప్రధాన వనరులు. వారిని దూరం చేసుకుంటే సంస్థ మనుగడే కష్టమవుతుంది.

అందుకే బ్యాంకుల కంటే ముందు మన ఉద్యోగుల బాకీలు తీర్చటమే ప్రధానం. చెక్కు తయారుచెయ్యండి" అన్నాడు మల్హో.

దిలీప్ వెంటనే స్పందించాడు. "నాకు తెలుసు సర్! మీరు ఏదో ఒక ఏర్పాటు చేయగలరు. అందుకే ఉద్యోగ సంఘాలతో మాట్లాడి వారు సమ్మెకు వెళ్ళకుండా ఆపాను. అతి కష్టం మీద వారు ఈ రోజు వరకూ ఆగారు. ఇప్పుడు వారికి ఇవ్వవల సిన పేమెంట్ ఇచ్చేస్తే ప్రస్తుతానికి ఒక బాధ తప్పుతుంది"

"చెక్కు ఎంతకి రాయమంటారు? "

దిలీప్ తన లాప్‌టాప్‌లో చూసి అమౌంట్ చెప్తే ఆ మొత్తానికి చెక్కు రాసి ఇచ్చాడు మల్హోత్రా.

ఆంచల్ సోఫాలో నుండి లేచి వీరి దగ్గ రకు వచ్చింది.

మల్హోత్రా చెక్కు మీద వేసిన సంఖ్య చూసిన ఆమెకు కళ్ళు తిరిగినంత పన యింది. ఆ డబ్బు పెట్టి ఒక భారీ బడ్జెట్ సినిమా తీయవచ్చు. అన్ని సమస్యల మధ్య కూడా వ్యక్తిగత ఖాతాలో అంత పెద్ద మొత్తం సమకూర్చగలిగిన అతని సామర్థ్యం చూసి ఆమెకు ఈర్ష్య కలిగింది.

దిలీప్ మాత్రం ఆంచల్ తన పక్కన నిలబడ్డా కళ్ళెత్తి ఆమెవైపు చూడకుండా జాగ్రత్త పడ్డాడు. తన లిమిట్స్ ఏమిటో అతనికి బాగా తెలుసు.

మల్హోత్రాకి సినీ రంగంలో కూడా చాలా మంది పరిచయస్థులు ఉన్నారు. వారి ద్వారా తనకి సినిమా ఛాన్స్ ఇప్పిస్తాడన్న ఆశతో ఆంచల్ అతని చుట్టూ తిరుగు తోంది. అయితే అతనే ఇన్ని సమస్యల మధ్య ఉన్నాడన్న విషయం ఆమెకి ఇప్పుడే తెలిసింది.

చెక్కు తీసుకున్న దిలీప్ బయటకు వెళ్ళి పోయాడు.

మల్హోత్రా ఏదో ఆలోచిస్తున్నట్లు తన కుర్చీలో నుండి కదలకుండా ఉండిపో యాడు.

ఆంచల్ నెమ్మదిగా నడుచుకుంటూ మల్హోత్రా దగ్గరకు వచ్చింది.

వెనుక నుండి వచ్చి తన భుజాల మీద మసాజ్ చేస్తున్న ఆంచల్‌ని అభావంగా చూశాడు మల్హోత్రా. "ఆంచల్, ఆట ఆడ వలసిన సమయం ఆసన్నమయింది. కానీ నీతో కాదు.. బ్యాంకర్లతో! ఆ పని అయ్యాక మరలా కలుద్దాం!" సీట్లో నుండి లేస్తూ అన్నాడు.

★ ★ ★

బ్యాంకర్లతో మల్హోత్రా సమావేశం జరు గుతోంది.

చర్చలు మొదలయి గంటలు గడు స్తున్నా ఎవరూ మెట్టు దిగలేదు. వాయి దాల ప్రకారం బకాయిలు కట్టవలసిందేనని బ్యాంకర్లూ, ప్రస్తుతం కట్టే పరిస్థితి లేదు కాబట్టి చెల్లింపులు వాయిదా వెయ్యాలని మల్హోత్రా.. ఎవరి పట్టు వారు వీడటం లేదు.

"నాకు ఒక విషయం అర్థం కావటం లేదు. ఇంతకాలం నేను వద్దన్నా అప్పులు తీసుకోమని నా చుట్టూ తిరిగారు. ఇప్పుడు నేను కొద్దిగా కష్టాల్లో ఉన్నానని తెలియ గానే డబ్బు అంతా ఒక్కసారిగా కట్ట మంటే, ఎక్కడనుండి పుట్టిస్తాను? " సమా వేశంలో ఉన్న బ్యాంకర్లను ఉద్దేశించి అన్నాడు మల్హోత్రా. అతని స్వరంలో ఏ మాత్రం తొట్రుబాటు కానీ, తడబాటు కానీ లేదు. ఎప్పటిలానే అదే అతిశయం, అదే హుందాతనం.

"మాకు రావలసిన వాయిదాలు కట్టి నంత కాలం మీరెన్ని కష్టాల్లో ఉన్నా మేము పట్టించుకోము. కానీ మాకు రావ లసిన డబ్బే కట్టలేనప్పుడు మేము ఎన్ని రోజులని చూస్తూ వుండగలం? మేము కూడా మా యాజమాన్యాలకు సమాధానం